హామీలకు బాబు ఎగనామం!


హాజరైన ప్రజలు


క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న విజయానందరెడ్డి నాయకులు

- ప్రజలకు చాటిచెబుతున్నందుకే ఓర్చుకోలేక సీఎం డైవర్షన్ పాలిటిక్స్
- ‘బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ’లో విజయానందరెడ్డి విమర్శ
- చంద్రబాబు హామీల వీడియో ప్రదర్శన

చిత్తూరు కార్పొరేషన్: కాలయాపనతో ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ఎగనామం పెట్టే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేస్తోందని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి విమర్శించారు. బుధవారం ‘బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ’ కార్యక్రమాన్ని 45వ డివిజన్ మంగసముద్రంలో శారద శివకుమార్, 46వ డివిజన్ ఓబనపల్లెలో బాబురెడ్డి, 48వ డివిజన్ తంగవేలుకాలనీలో నారాయణ, 47వ డివిజన్ హైకాలనీలో సెల్వరాజ్, 49వ డివిజన్ డీబీవీధిలో గిరినాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, వాటిపై జగన్ ప్రశ్నించడం వీడియోలను ఆయా డివిజన్లలో ప్రదర్శించారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పథకాలేవీ అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను విజయానందరెడ్డి వివరించారు. స్థానికంగా ఉన్న డంపింగ్ యార్డ్‌ను తరలిస్తామని పాలకులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు మోసపూరిత పాలనపై ధ్వజమెత్తారు. ఆయనతో పాటు డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ మాట్లాడారు. ప్రతి పక్షంగా ఒత్తిడి చేస్తేనే గ్యాస్, తల్లికి వందనం పథకాలు అరకొరగానైనా ప్రజలకు అందాయన్నారు. ఇప్పటికీ చాలామందికి గ్యాస్ డబ్బులు, తల్లికి వందనం నిధులు తల్లుల ఖాతాల్లో జమ కాలేదన్నారు. కొంత మందికి ఆ డబ్బులు పడినా తేడా ఉందన్నారు. ఆడబిడ్డ నిధి, మహిళలకు ఉచిత బస్సు, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్, నిరుద్యోగులకు ఉద్యోగాలు లేదా నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారో ఇకనైనా కూటమి ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. నెరవేర్చని హామీలు, అమలు చేయని పథకాల గురించి విస్తృతంగా ప్రజలకు చాటిచెబుతుండడంతో కూటమి ప్రభుత్వం సహించలేక దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికే కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, అందుకే చంద్రబాబునాయుడు డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యతిస్తున్నారని ఎండగట్టారు. కార్యక్రమంలో నాయకులు విజయసింహారెడ్డి, సూర్యప్రతాప్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మధురెడ్డి, మనోజ్‌రెడ్డి, శరవణ, నౌషద్, నవాజ్, జబ్బా డివిజన్ల నాయకులు మండీచంద్ర, చక్రవర్తి, సద్దాం, ఉషర్, మురగ, ప్రకాష్, బాబుబాయ్, బాషా, గిరి, బాబు, బాబురెడ్డి, గోపి, రోహిత్‌రెడ్డి, జయశంకర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, రాజేష్ రెడ్డి, రెడ్డెప్ప, సురేష్, రామ్మూర్తిరెడ్డి, ప్రకాష్, చిట్టి, అప్పాజీ, కిశోర్, సుబ్బా, హమీద్, దినేష్, దిలీప్, మణి, ఉబేదుల్లా, రమణ, కరీం, దస్తగిరి, కార్తీక్, మదన్, బాల, సుబ్రమణ్యం, సందీప్, రవిరెడ్డి, శివారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేష్, శ్రీనివాసన్, సురేష్, మహేష్, శరవణ, దివాకర్, ముజీబ్, జ్యోతి, రవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం


ఆలయ అధికారులకు విరాళమిస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన నిత్యాన్నదాన ట్రస్టుకు బుధవారం పూతలపట్టు మండలం బందార్లపల్లెకు చెందిన కొంగర నవీన్ లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు ఆయనకు స్వామి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది బాలాజీ నాయుడు, కోదండపాణి పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు సమస్యలు సృష్టిస్తే చర్యలు

ఐరాల: ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని కాణిపాకం ఎస్‌ఐ నరసింహులు హెచ్చరించారు. బుధవారం ఆయన కాణిపాకంలో ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించారు. ఆటో డ్రైవర్లు ప్రధాన కూడళ్ల వద్ద ఆటోలు నిలుపరాదని, ఇష్టానుసారంగా నడిపితేన చర్యలు తీసుకుంటామని, రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపుల ముందు వాహనాలు పార్కింగ్ చేయరాదన్నారు. షాపు యజమానులు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అగరంపల్లె నుంచి కాణిపాకం ఆలయం వరకు వాహనాలు రోడ్డుకు ఇరువైపులా కాకుండా ఒక రోజు ఎడమ వైపు, మరుసటి రోజు కుడి వైపు పార్కింగ్ చేయాలన్నారు. కాణిపాకం ఆలయానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించినట్టు చెప్పారు.

సీఐలు బాధ్యతల స్వీకరణ


నిత్యబాబు, లక్ష్మీనారాయణ

చిత్తూరు అర్బన్: చిత్తూరులో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ ఇటీవల ఎస్పీ మణికంఠ ఉత్తర్వులు జారీ చేయడం విదితమే. ఈ నేపథ్యంలో బుధవారం తాలూక సీఐగా నిత్యబాబు, ట్రాఫిక్ సీఐగా లక్ష్మీనారాయణ బాధ్యతలు స్వీకరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


మాట్లాడుతున్న డాక్టర్ సంధ్య


హాజరైన ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు

గుడిపాల: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని గుడిపాల, బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారులు సంధ్య, రష్మిత అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లకు ఎంపీడీఓ శిరీష ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ, వాతావరణంలో మార్పుల దృష్ట్యా సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వివిధ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతి 15 రోజులకోసారి ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రపరచి క్లోరినేషన్ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. మలేరియా, డెంగీ, చికున్ గున్యా, బోధకాలు, మెదడువాపు వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే మంచి నీటినిల్వలు, మురుగునీటి నిల్వల్లో దోమ లార్వాలను గుర్తించి వాటిని తొలగించాలని, దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కృష్ణప్రసాద్, సీహెచ్ఓ బాలసూర్యనారాయణ, సిబ్బంది విజయ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమావేశం

ఐరాల: పూతలపట్టు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ప్రభాకర్ కోరారు. బుధవారం కాణిపాకంలోని ఓ ఫంక్షన్ హాలులో ఐదు మండలాల నాయకులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. కార్యక్రమంలో ఏపీసీసీ మాజీ కార్యదర్శి పరదేశి, నాయకులు కుమారి, నాగరాజునాయుడు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉపాధి అక్రమాలపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..


ఫీల్డ్ అసిస్టెంట్లను విచారణ చేస్తున్న ఎంపీడీఓ శిరీష

గుడిపాల: మండలంలోని ఉపాధి అక్రమాలపై అధికారులు విచారణకు పూనుకున్నారు. ‘అడ్డులేని ఉపాధి అక్రమాలు’ శీర్షికతో బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనంపై తఎంపీడీఓ శిరీష, ఉపాధి హామీ ఏపీఓ శ్రీనివాసులు స్పందించారు. బుధవారం మండలంలోని మొగరాళ్లపల్లె, చీలాపల్లెలో ఉపాధి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. కూలీలకు రోజూ సగటున ఎంత కూలి వస్తుందో ఆరా తీసారు. ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు సంబంధించి మస్టర్లలో ఎంతమందిని నమోదు చేస్తున్నారు? ఎంతమంది పని చేస్తున్నారు? ఎంతమందిని ఫొటో తీస్తున్నారు? ఇత్యాది వాటిపై విచారణకు ఉపక్రమించారు. వీటన్నింటిపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని, అక్రమాలకు పాల్పడినట్లు తేలితే బాధ్యులపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ చెప్పారు.

చింతగుంటూరులో ‘ఫ్యామిలీ డాక్టర్’


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని బొమ్మసముద్రం డాక్టర్ రష్మిత కోరారు. మండలంలోని చింతగుంటూరులో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం గురించి తెలియజేశారు. అనంతరం ఇళ్లకే పరిమితమైన రోగుల వద్దకు వెళ్లి వారికి వైద్యసేవలను అందజేశారు. వైద్యసిబ్బంది శ్రీలక్ష్మి, వనజ, శ్రీదేవి, కోకిల, సుజాత పాల్గొన్నారు.

కరెంట్ కోతలు.. రైతన్నలకు అవస్థలు

- ఫీడర్ సమస్యలున్నాయంటున్న ట్రాన్స్‌కో అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం కుర్చివేడు ప్రాంతంలో ఎడాపెడా విధిస్తున్న కరెంటు కోతల స్థానికులను, రైతులు ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయంపైనే ఆధారపడిన రైతన్నలు ఈ కోతల దెబ్బకు కరెంటు సరిగా లేక, పంటల సాగుకు అవస్థలు తప్పడం లేదని లబోదిబోమంటున్నారు. దీనిపై ట్రాన్స్‌కో అధికారులను సంప్రదిస్తే..బల్లి పడిందని, ఫీడర్ ఎగిరిపోయిందని, తీగలు తెగిపోయాయని..ఇలా పలు రకాల సాకులు చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. కనీసం రోజుకు రెండు గంటల పాటు కూడా కరెంటు ఉండడం లేదని, 8 నెలలుగా కోతలతో అల్లాడిపోతున్నామని, ఇలాగైతే పంటలు ఎలా పండించాలని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి కరెంటు కోతలు లేకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ రాజాను వివరణ కోరగా.. అప్పుడప్పుడు ఫీడర్ సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. రెండు గంటలు మాత్రమే కరెంటు ఇస్తున్నట్లు చెప్పడం సరికాదని, 5 నిమిషాలు కరెంటు పోయినా...గంట అయిందని చెబుతున్నారని పేర్కొన్నారు. కరెంటు సరఫరాకు సంబంధించి సమస్యలుంటే నేరుగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

యూనియన్ మహాసభలు జయప్రదం చేయండి




మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు, హాజరైన కార్మిక నాయకులు

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

చిత్తూరు కార్పొరేషన్: కార్మిక వ్యతిరేక విధానాలపై బలమైన పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం చిత్తూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 28, 29న యూనియన్ జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు చెప్పారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను తీసుకురావడంతో దానికి వ్యతిరేకంగా జూలై 9న దేశవ్యాప్త సమ్మె జయప్రదం అయిందన్నారు. సుప్రీంకోర్టు స్కీం వర్కర్లైన అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చిన అమలుచేయకపోవడం, ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు 11 నెలలుగా బకాయి వేతనాలు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు భద్రత లేక అవస్థ పడుతున్నారన్నారు. స్కీం వర్కర్లపై పని భారం పెంచి ఉపాధి లేకుండా చేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకరకంగా, అధికారంలోకి వచ్చాక మరోలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు, జిల్లా ఉపాధ్యక్షులు గంగరాజు మాట్లాడారు. క్షేత్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని కమిటీల మహాసభలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గిరిధర్‌గుప్త, జిల్లా నాయకులు షకీల, మమత, జ్యోతిరావు, గంగ, ఆరోగ్యదాస్, శివ, విజయ, వరలక్ష్మి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో సినీనటులు


సినీనటులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని బుధవారం సినీ నటులు ఆనందరామరాజు, సుదర్శన్, మదన్, సాయి దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి, సిబ్బంది విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుని మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్నారు. బుధవారం డీఆర్‌డీఏ శిక్షణా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. నియోజకవర్గంలోని గుడిపాలలో కమ్యూనిటీ నిర్వహణ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ కేంద్రంలో మహిళలకు రాష్ట్రస్థాయి నుంచి శిక్షణ ఇస్తారని, తద్వారా గ్రామాల్లో ఆర్థికాభివృద్ధిని సాధించాలన్నదే లక్ష్యమన్నారు. ఇదలా ఉంచితే, చిత్తూరుఅభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరామని, నిధులు మంజూరైతే నగరాన్ని సుందరంగా అభివృద్ధి చేస్తామన్నారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి మాట్లాడుతూ, ప్రతి ఇంట్లో కనీసం ఒక మహిళ వ్యాపారవేత్తగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నగర మేయర్ అముద, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేద్దాం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి భారతి

బంగారుపాళెం: మానవ అక్రమ రవాణాను సమష్టిగా అడ్డుకట్ట వేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి భారతి పిలుపునిచ్చారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని జయంతి ఎస్టీ కాలనీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడారు. ఆర్థిక ప్రయోజనాల కోసం మనుషులను అంగడి సరకుగా మార్చి క్రయవిక్రయాలు చేయడాన్ని మానవ అక్రమ రవాణా అంటారని, ఇది అత్యంత దుర్మార్గమైన మానవ హక్కుల ఉల్లంఘన అని అన్నారు. మానవ అక్రమ రవాణా ప్రధానంగా లైంగిక దోపిడి, వెట్టిచాకిరీ, బానిసత్వ రూపాల్లో ఉంటుందని, ఇది మానవత్వంపై జరిగే క్రూరమైన దాడి అని అభివర్ణించారు. ఇలాంటి సంఘటనలను మహిళా–శిశు సంక్షేమ శాఖ, పోలీసులు కలసికట్టుగా నిరోధించాల్సిన అవసరం ఉందన్నారు. తహసీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వళ్లెమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వికలాంగుడికి ఆర్థిక సాయం

పెనుమూరు(కార్వేటినగరం): రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయి, జీవనం కష్టతరంగా మారిన ఓ యువకుడికి చిత్తూరు మాజీ కౌన్సిలర్ పార్థసారథినాయుడు ఆర్థిక సాయం చేశారు. వివరాలు.. మండలంలోని కేసీ పల్లె పంచాయతీ గొల్లపల్లె దళితవాడకు చెందిన మునిరత్నం కుమారుడు జగదీష్ గతంలో రోడ్డు ప్రమాదానికి గురై తన రెండు కాళ్లను కోల్పోయి వికలాంగుడయ్యాడు. అసలే పేద కుటుంబం కావడం, కుమారుడు వికలాంగుడు కావడంతో ఇద్దరు కుమార్తెలతో కలిసి మునిరత్నం వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ బతుకు బండిని కష్టంగా లాగిస్తున్నారు. ఇది తెలుసుకున్న చిత్తూరు మాజీ కౌన్సిలర్ బుధవారం ఆ గ్రామానికి వెళ్లి జగదీష్ తల్లిదండ్రులకురూ.10 వేలతోపాటు కొత్త దుస్తులను అందజేశారు. జగదీష్‌కు ప్రభుత్వం వికలాంగ పింఛన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

పేదలను ఆదుకోవడమే పీ.4 లక్ష్యం




మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి, హాజరైన సర్పంచులు, డీలర్లు, దాతలు

తవణంపల్లె: సమాజంలో పేదరికం, ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆదుకోవడమే లక్ష్యంగా దాతలు ముందుకు రావాలని జిల్లా పరిశ్రమ శాఖ మేనేజర్, పూతలపట్టు నియోజకవర్గ ప్రత్యేక అధికారి సూరిబాబు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ‘జీరో పవర్ పీ4’పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పేదరికంతో సతమతమవుతున్న వారిని, ఆర్థికస్తోమత లేక చదువుమానేసిన వారికి దాతలు తమ వంతు చేయూతనిచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో పేదరికం, వివిధ సమస్యలతో బాధపడుతున్న వారిని పంచాయతీ కార్యదర్శులతో సర్వే చేసి నివేదిక తయారు చేస్తామన్నారు. వీరిని కొంత ఆర్థికస్తోమత ఉన్న వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తోడ్పాటునివ్వాలన్నారు. దీనిపై దృశ్య మాధ్యమంతో అవగాహన కల్పించారు. దీనికి ఒక యాప్ కూడా ఉంటుందని, ఈ యాప్‌తో కూడా ఆదుకోవచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ మురుగేష్, డీలర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ తనిఖీ


పొన్నేడుపల్లె మోడల్ స్కూల్లో టీచర్లతో మాట్లాడుతున్న ఎంఈఓ హేమలత

తవణంపల్లె: ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధించాలని ఎంఈఓ హేమలత ఆదేశించారు. బుధవారం మండలంలోని పొన్నేడుపల్లె మోడల్ స్కూల్‌ను ఆమె తనిఖీ చేశారు. తొలుత టీచర్లు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లు, రికార్డులను, అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడం నేర్చుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలన్నారు. టీచర్లకు సలహాలు–సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ చిట్టిబాబు పాల్గొన్నారు.

పౌరులు తమ హక్కులను కాపాడుకోవాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

పూతలపట్టు(యాదమరి): భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడూ వినియోగించుకుని వాటిని కాపాడుకోవాలని తహసీల్దార్ రమేష్‌బాబు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని ఆకనంబట్టు దళితవాడలో పౌరహక్కులపై ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, సమాజంలో అందరూ కలసిమెలసి ఉండాలన్నారు. ప్రజల రక్షణ కోసమే చట్టాలు ఉన్నాయని, హక్కులతోపాటు వాటి గురించి కూడా తెలుసుకోవాలన్నారు. హక్కులకు భంగం వాటిల్లితే పోలీస్, న్యాయ సహాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అశ్విన్, వీఆర్‌ఓ ధరణి, సర్పంచ్ ఎంఎస్ మణి, గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ


ర్యాలీలో వైద్య సిబ్బంది, టీచర్లు, విద్యార్థులు

తవణంపల్లె: జాతీయ డెంగీ మాసోత్సవాలను పురస్కరించుకుని మలేరియా నిర్మూలనపై బుధవారం మండలంలోని కృష్ణాపురంలో వైద్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ వ్యాధి అంతం..మనందరి పంతం, ఫ్రైడే డ్రైడేగా పాటిద్దాం.. దోమలను నిర్మూలిద్దాం అని నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, రేవతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌తో ప్లాన్ అప్రూవల్స్ సులభతరం

- రేపటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- చిత్తూరులో 33 లేఔట్లను గుర్తించాం
- మీడియాతో అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర వెల్లడి



చిత్తూరు అర్బన్: ఇప్పటి వరకు అప్రూవల్స్ లేకుండా ఉన్న లేఔట్లలో స్థలాలు కొనుగోలు చేసి.. ఇళ్లు కట్టుకోవడానికి ప్లాన్ అప్రూవల్స్ కోసం ఇబ్బంది పడుతున్న వాళ్లు లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్)ను సద్వినియోగం చేసుకోవాని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర కోరారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది జూన్ 6వ తేదీ వరకు ఎక్కడైతే అనుమతుల్లేకుండా లేఔట్లు వేసారో, వాళ్లంతా కూడా ఎల్‌ఆర్‌ఎస్ పరిధిలోకి వస్తారన్నారు. ఇదే సమయంలో నిర్ణీత తేదీలోపు సంబంధిత ఎల్‌ఆర్‌ఎస్‌లో ఒక్క ప్లాటయినా విక్రయించి ఉండాలని, దానికి సంబంధించి రిజిస్టర్ పత్రాలు చూపాలన్నారు. చిత్తూరులో అనుమతుల్లేకుండా ఉన్న 33 లేఔట్లను తాము గుర్తించినట్లు వెల్లడించారు. ప్రభుత్వం సూచించిన తేదీకన్నా పదేళ్లు, ఇరవై ఏళ్ల క్రితం ఉన్న లేఔట్లను సైతం క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందన్నారు. ఓపెన్ ప్రాంతంలో 14 శాతం ఫీజులు చెల్లించి, మార్కెట్ విలువలో 10 –30 శాతం వరకు అపరాధ రుసుము చెల్లించి ప్రతి ప్లాటునూ క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో పోర్టల్ అందుబాటులో ఉంటుందని, సరైన ధృవీకరణ పత్రాలను లైసెన్స్ ఇంజినీరు, సర్వేయర్‌తో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అన్నీ సక్రమంగా ఉంటే మూడు రోజుల్లో ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ఇదలా ఉంచితే, ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా కార్పొరేషన్ ఖజానాకు దాదాపు రూ.3 కోట్ల వరకు ఆదాయం రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.



